# కాకుల మధ్య నీలకంఠం

అమరశ్రీ

తానెక్కడున్నాడో తనకే తెలియటం లేదు.

ఎక్కడకు పోతున్నాడో-ఏం చేస్తున్నాడో-ఎందుకు చేస్తున్నాడో- అసలది ఏ ప్రపంచమో- తను నడిచేది మెటల్ రోడ్డుమీదో, లేక నీళ్ళ మీదో- అతని అవయవాలు స్వాధీనం తప్పి పనిచేయ మానేసినయ్. పోయి పోయి పార్కు గేటుకు కొట్టుకున్నాడు. వెంటనే తనొక మనిషి నని మాత్రం గుర్తుకొచ్చింది నీలకంఠానికి.

మిట్టమధ్యాహ్నం ఏ పార్కు తీసి ఉంటుంది గనుక? మనకు పని లేకపోతే ఊళ్ళో వాళ్ళకు పనుండదూ? మెల్లగా గేటుపైకెక్కి అవతల వైపుకు దిగిపోయి ఒకమూల చెట్టుక్రిందకు చేరాడు.

అంతకు ముందు జరిగిన సంఘటనలోని విషయాలన్నీ వాటంతటవే ఒక్కొక్కటే గుర్తుకు వస్తున్నయ్. తనను శ్రీహరి అనవసరంగా కొట్టాడు. ఎక్కడ కొట్టాడు? చెంపమీద కొట్టాడు. ఏ చేత్తో కొట్టాడు? ఎడమ చేతితో కొట్టాడు. ఒక్కొక్క విషయమే చివరినుంచి గుర్తుకు వస్తున్నయ్.

అసలు శ్రీహరికి తనను కొట్టవలసినంత పనేమి వచ్చింది? తన క్రింద పని చేస్తున్న 'గుమాస్తా' ననుకున్నాడా శ్రీహరి? లేకపోతే స్వంత తమ్ముడి ననుకున్నాడా? ఎవరైతేమాత్రం ఒకడు మరొకడిని కొట్టవలసిన పనేముంటుంది? కొట్టవలసి వస్తే మాత్రం ముందు వెనుక లాలోచించకుండా కొట్టడమేనా? ఆలోచన లెక్కువైపోతున్నయ్. హృదయావేదన మీరిపోతున్నది. ఆ సమయంలో గనుక శ్రీహరి అక్కడ ఉన్నట్లయితే తెలిసేవి ఎలాటివో నీలకంఠం మనోభావాలు.

శ్రీహరి అన్నట్లు నవ్వులాటే నిజమైంది. అయినా తన తప్పేమున్నది? తన ప్రవర్తనను వెనకకి చూడబోతున్నాడు నీలకంఠం. శ్రీహరి ఆపినకొద్దీ తను ఛలోక్తులు విసిరాడు. అంతే తను చేసినపని. అది తప్పా? తను చేసినపనిలో తప్పెంతవరకున్నదని తర్కించుకోసాగాడు నీలకంఠం. ఏదో, స్నేహితుడు గాబట్టి కులాసాగా మాట్లాడాడు. అంతమాత్రానికే తప్పయితే—ప్రతి నిముషం మన ప్రవర్తనలో లెక్కలేనన్ని తప్పులు చూడవచ్చు.

అసలు శ్రీహరిననే పనేమున్నది? నిష్పాక్షికంగా విచారిస్తే అది తన తప్పే. పదిరోజుల స్నేహాన్నాధారం చేసుకొని తనెంతో అతిచనువుగా రాసుకు తిరిగినందుకు తగినశాస్తి చేశాడు. 'ఈ ప్రపంచంలో ఇంత చనువు పనికిరాదోయ్' అని పరోక్షంగా తనకు బుద్ధిగరిపాడు.

నీలకంఠం అతిసునిశితంగా ఆలోచించసాగాడు. శ్రీహరితో తన ప్రవర్తనంతా అతని కంటికే నిముషంలో తప్పులానే, అగుపిస్తున్నది. శ్రీహరి ఎవరు? తనెవరు? పదిరోజుల క్రిందటి ఆకస్మాత్ పరిచయం ఏవిధంగా జరిగింది? ఏ మాత్రమూ అవగతం కావటంలేదు నీలకంఠానికి.

శ్రీహరి ఇచ్చిన చొరవే తనుకూడా చనువు తీసుకొనేలా చేసింది. తనెంత చనువు తీసుకొని ఎంతమంది ఎదుట ఎగతాళి చేస్తేమాత్రం చెయ్యి చేసుకొని కొడతాడా? అంత మందిలో మాట అన్నందుకే శ్రీహరి కంతకోపం వస్తే, అందరి ఎదుట తను దెబ్బ తిన్నందుకు కెంతగా బాధపడాలి. అందరి ఎదుట మాట అన్నందుకు బదులుగా దెబ్బకొట్టాడు. ఆ దెబ్బ తిన్న తనెటువంటి ప్రతికారం చేయాలి? తను చేయబోయే ప్రతీకారం ఎంత శక్తి పూరితమై ఉండాలి? శ్రీహరిని మానసికంగా ఎంతగా బాధించగలిగినదై ఉండాలి తాను చేయబోయే ప్రతీకారం.

తనక్కడే అందరి ఎదుటనే చెప్పేశాడు తనే విధంగా పగ దీర్చుకొనేదీ. దాదాపు ఇరవైమంది నిలబడిఉన్న చోటులో పట్టుకొని చెప్పుతో కొడతానన్నాడు తను. నీలకంఠాని

కిప్పుడొక అనుమానం వచ్చిపడింది. ఆ ఉద్రేకంలో అన్నాడు తనా విధంగా కొట్టితీరుతానని. అసలు తను కొట్టగలడో, లేదో? నిశ్చయంగా తను కొట్టలేడు. పీడు పందిలా బలిసి ఉన్న శ్రీహరిని తనబోటి బక్కపీనుగ ఏవిధంగా కొట్టగలుగుతాడు? శ్రీహరి పదిమందిలో కొట్టాడు. అంతకు రెట్టింపు మంది ఉన్నచోట తను కొడతానన్నాడు. శ్రీహరి చేతితో కొట్టాడుగాబట్టి తను చెప్పుతో కొడతానన్నాడు. మళ్ళీకొట్టగలననే ధైర్యం వచ్చింది శ్రీహరికి. తరువాత తను దెబ్బలు తిన్నా కనీసం మొదట్లో తననుకున్న ప్రకారం చెప్పుతో ఒక్క దెబ్బ-ఒక్కటే ఒక్క దెబ్బ కొట్టలేడూ! అందులో తనను కొట్టినపుడున్న పదిమందికూడా ఉండాలి తను శ్రీహరిని కొట్టే సందర్భంలో. అసలింత రభస ఎందుకు జరగాలి? శ్రీహరి అతి చనువుగా సంచరిస్తేనే, తనూ రెండు ఛణుకులు వదిలాడు. శ్రీహరి గనుక, అందరివలెనే సంచరించి ఉన్నట్లయితే తనూ లోకంలో తదితరుల మాదిరిగనే సంచరించి ఉండేవాడు. పదిరోజుల పరిచయం పని చెడగొట్టింది. అతి స్నేహంగా మారి సర్వనాశనమైంది. తొండ ముదిరి ఊసరవెల్లయినట్లు. ఇక్కడ తొండ త్వరగా ముదిరింది. అదీ అసలు వచ్చిన చిక్కు.

తను వ్రాసిన పద్యాలను చూస్తుండగానే కాపీచేసి పేపరు కిచ్చుకున్నాడు కనీసం తనకు తెలియబరచకుండానే. తనది చూచి అతని తత్వమే అంతకాబోలునని ఊరుకున్నాడు. తనేదో 'సెక్సు'ను గురించిన మంచి వ్యాసాన్ననువదించి పెట్టుకొంటే దానిని తీసుకుపోయి పది రూపాయలు తెచ్చుకున్నాడు. తనకు డబ్బు కావాలని చెప్పి ఆ వ్యాసమిచ్చి డబ్బు తెచ్చుకొంటానని చెప్పిన నాటి సాయంకాలమే పోయి పత్రిక కిచ్చివచ్చాడు. పోనీ పేరు తీసివేస్తే తీసేశాడు, పత్రిక వాళ్ళిచ్చిన పారితోషికమన్నా ఇచ్చాడా, అంటే అదీ లేదు. తన స్వంత ఖర్చులకు వాడుకొని కూర్చున్నాడు. తను డబ్బులులేక పడుతున్న అవస్థను కళ్ళారా చూసికూడ.

చాలా ఆప్యాయంగా సంచరించాడతను. కాని తనూ అదే మార్గంలోకొస్తే సహించలేక పోయాడు. అతని పదిరోజుల ప్రవర్తనలో తనను ఎగతాళిచేస్తూ అన్నమాటలనే గనుక గుర్తించుకొన్నట్లయితే ఎన్నో అయేవి. కాని తనొక్కసారి ఎగతాళిచేస్తే సహించలేక పోయాడు. వెధవ మనస్తత్వం!

పైగా స్వార్థం కావసినంత కనబడుతున్నదాతని ప్రవర్తనలో. రచన చేయటము చేతగాక పోయినా తనరచన తీసుకుపోయి పేరు పెట్టుకొని స్వంత రచన జేశాడు. పోనీ, పేరు అచ్చుగావాలని ఆపని చేశాడుదాని, అందులో అతని స్వార్థం ఏమాత్రమూ లేదనుకుందాము. అదే నిజమయితే పత్రిక వాళ్ళిచ్చిన పదిరూపాయలు తెచ్చివ్వచ్చుగా! అదీలేదు. ఈ విషయాన్ని పూర్తిగా వదిలేద్దాము. అంతకుముందు తన పేరుతో ఉన్న పద్యాలను ఎందుకు పేపరు కిచ్చుకో వలసి వచ్చింది? తప్పకుండా శ్రీహరి స్వార్థపరుడు, సహన శూన్యుడనే నిర్ణయానికి వచ్చాడు నీలకంఠం.

ఇటువంటి వాడిని 'స్టడీ' చేయకుండా, చేతులు కలిపి తిరగటము తనదేతప్పు. అసలు తను స్టడీ చేయవలసిన అగత్యమేముంది? వెంకట్రావు అతనిని తీసుకువచ్చి తనను పరిచయంచేస్తూ చెప్పిన మాటలు, శ్రీహరిని నమ్మకస్తుడిలా చిత్రించినయ్ తనముందు. రచయిత—తాలూకాఫీసులో గుమాస్తా—ఫలానా చోట రూము - చాలమంచివాడు - అని ఇంకేమోమో చెప్పాడు. వెంకట్రా వతని కన్ని తోకలుతగిలించి తనకు పరిచయం చేస్తే తను మాత్రం శ్రీహరి నేవిధంగా అపార్థం చేసుకొంటాడు? ఇంకెవరైనా చెప్పిఉన్నట్లయితే 'ఏమోలే' అనవచ్చు. వెంకట్రా వటువంటివాడు చెపితే, ఆ చెప్పినదానిలో కోతలుంటాయని తనుమాత్రం ఏవిధంగా అనుకొంటాడు? నీలకంఠానికి తల క్రిందులయేటంతటి ఆలోచనలు వచ్చినయ్.

'ఏవిధంగా చస్తే నాకేమని' మెల్లగా లాగు దులుపుకుంటూ లేచాడు. ఆలోచనలనుకూడ వదిలేద్దామని దులిపాడు కాని వెంటే వచ్చినయ్. ఉపేక్షించి ఊరుకో బుద్ధి పుట్టలేదు నీలకంఠానికి. అంతమందిలో తనన్న మాటను నిలబెట్టుకోవాలనే ఉన్నది కాని, శ్రీహరిని

కొడుతున్నానంటే వద్దంటున్నారెవరో. అతను తనను కొడితే ఎంతో బాధ పడ్డాడు. అందరి ముందర అనవసరంగా కొట్టటము బాగుండదని, అది ఒక 'వేధన' చేయవలసిన పని అని తాను కానికూడ మళ్లా అదే మార్గాన్ననుసరించటము ఆత్మకు విరుద్ధంగా ప్రవర్తించటము వంటిది. ఎవడో బుద్ధి తక్కువయి గడ్డి తింటే, బుద్ధిగల వాడు తనుకూడ అదేపని చేస్తాడా? చేయగూడదనుకున్నాడు నీలకంఠం. 'అభిమానం' కట్టుకున్న పెళ్లాంలా వెనుకకు గుంజుతోంది నీలకంఠాన్ని. అంతమంది స్నేహితుల ఎదుట, అప్పుడు కొట్టలేక పోయినా, తానొక పెద్దవీరుడిలా తరువాతెప్పుడో కొడతానని చిసిగిపోయేలా అరచి, ఆచరించలేకపోవటము-లోకం ముందర అతనిని ధైర్యంగా నాలుగు మైళ్లు తిరోగమించే బ్రిటిష్ సైనికుడిలా చిత్రిస్తుంది. ఒకవేళ అతను ధర్మబద్ధంగా వర్తించినా, 'కాళ్లులేని ప్రపంచం' నడచిపోయి తెరచాటున ఉన్న నగ్నసత్యాన్ని చూడలేదు. అధర్మయుక్తంగా దాబులు పచరించే వాడినే ఈ ఇరవైయవ శతాబ్దపు 'తలలేని సంఘం' గౌరవిస్తుంది. కాని ఉత్తమ మానవుడిని ఈ గుడ్డిలోకం గాని, తలలేనిసంఘం గాని, కాళ్ళులేని ప్రపంచంగాని ఆదరించలేదు. ఈ మూడింటినీ కలిపి అనాథశరణాలయంలో చేర్పించి విద్యగరిపి విజ్ఞాన యుతంగా తయారు చేస్తేగాని పనికిరావనిపించింది నీలకంఠానికి. అందుచేతనే ఈ వెధవపశువుల ఎదుట తానొక శక్తిహీనుడిలా చిత్రించబడవచ్చును. అన్న ప్రకారం నడిచి తీరని పక్షంలో 'ఇటుసూర్యుడు అటు పొడిచినా' సరే తను అన్నప్రకారం నడిచి తీరాలనుకున్నాడు నీలకంఠం.

ఇంతలో మళ్ళీపోయి పార్కు గేటుకే కొట్టుకున్నాడు. నీలకంఠానికి ఆశ్చర్యంవేసింది. తన మనస్సంత తీవ్రంగా పనిచేస్తూ శరీరాన్ని మరిపింపజేస్తుందని అనుకోలేదు నీలకంఠం. మరొకసారి జాగ్రదవస్థలోకొచ్చాడు. గేటెక్కి రోడ్డు మీదికొచ్చాడు.

ఎవడో ఒక బండవాడు మోతజేసుకుంటూ వస్తున్నాడు. నీలకంఠం ఆదేపనిగా సాగిపోతున్నాడు. చౌకువరకు పోయేసరికి, తనంతకు చూసిన బండవాడు సరిగా తనవెనుకకే వచ్చి నిలబడ్డాడు. 'ఒక్క కాణీ' అంటున్నాడు బండవాడు. ఒకచేయి పొట్టకానించుకొని ఉన్నాడు. మరొకచేతిలో ఒక చిన్న కత్తి, ఆ కత్తి పిడికి నాలుగురేకులు ఉన్నయ్. రక్తం చేతులనిండా ఉన్నది. పొట్టకానించుకొన్న చేతితో గాటుపెట్టుకున్నాడు. రక్తం ప్రవహిస్తున్నది. దానిని చూపించి అడుక్కుంటున్నాడు. ఎందుకా విధంగా తెగగోసుకున్నావని వాడినెవ్వరూ అడగనూలేదు. వాడు చెప్పనూలేదు. వాడికిమాత్రం తెలిసివిడిస్తేగా తనెందుకు కోసుకున్నదీ? కాని కోసుకున్నందువలన లభించే లాభం తెలుసు. పొట్టకోసం చేయికోసుకొని, ఉన్నరక్తాన్ని నేలపాలు చేసుకొంటున్నాడా అభాగ్యుడు. అది అతనికే నష్టమని తెలియదు పాపం! చేతగానితనాన్ని ప్రదర్శించుకొంటున్నాడు. నీలకంఠం ఆలోచిస్తూనే సాగిపోతున్నాడు. బండవాడు మాత్రం వదలకుండా దారికడ్డం వస్తున్నాడు. 'ముష్టిలో వీరముష్టి' అనుకొని తన దారిద్ర్యంలోనే వాడికొక కాణీ పారేశాడు. నీలకంఠం తత్వప్రపంచంలో మరొక అడుగు ముందుకువేశాడు, శ్రీహరినీ, బండవాడినీ తత్వ ప్రపంచంలో ఒకచోట నిలబెట్టాడు నీలకంఠం. చూశాడు ఇద్దరకూ పోలికలేమైనా ఉన్నాయేమోనని. మొదట కనుపించలేదు, 'ఎక్సరే' కళ్లు తగిలించుకొన్నాడు. పోలికలు చాలా చిన్నవిగా అగుపిస్తున్నయ్. కాంపౌండు మైక్రోస్కోపును కూడ జతచేసి దృష్టి సారించాడు. వారిద్దరికీ గల పోలికలప్పుడు నీలకంఠానికి స్పష్టంగా కనుపడసాగాయి.

పొట్టకూటికోసం, నాలుగురోజులా వ్యర్థ ప్రపంచంలో బ్రతుకటంకోసం బండవాడు చేతిని కోసుకొని దానినా 'కళ్లులేని లోకాని'కి చూపించి ఉదరాన్ని నింపేసుకొంటున్నాడు. శ్రీహరి కూడ అంతే! పేపరులో తన పేరు అచ్చుగావటము కోసం, తన పద్యాలను కాపీ చేసి- స్వచ్ఛమైన తెలుగులో చెప్పాలంటే దొంగిలించి- అచ్చువేయించుకొన్నాడు శ్రీహరి. శ్రీహరికీ, మొండిబండవాడికీ మధ్య భేదం ఏమాత్రమూ కనుపించటములేదు నీలకంఠానికి. ఆకారంలోనే భేదం! ఆచారాలలో కాదు భేదం! ఇద్దరిదీ అదే తత్వం.

14 మానవాతీతమైన ప్రపంచంలోకి పోతున్నట్టు పోతున్నాడు నీలకంఠం. పెట్టుబడిదార్ల టాక్సీలలో కూర్చుంటే వచ్చే ధ్వని—రిక్షాగంటల అల్లరి—లారీలు లేపే దుమ్ము—తప్పు చేయలేని అసమర్థులముందు తమ సమర్థతను నిరూపించుకొనటానికి పోలీసులు వేసే కేకలు—ఇవన్నీ వినపడటంలేదు నీలకంఠం చెవులకు, ఆ బండవాడు చేతిలోఉన్న రేకులు చేసిన మోతతప్ప, ఈ కల్లోలప్రపంచం నుండి, కలతలులేని నిర్మల ప్రపంచంలోకి పోదామని ప్రయత్నిస్తున్నట్టున్న దాతనివైఖరి.

మునిసిపల్ లైబ్రరీ దగ్గర కలశాడు శ్రీహరి. నీలకంఠం అతనికేసి చూడలేక పోయాడు. భయంపుట్టి కాదు, అసహ్యంవేసి. కాని తనంతట తానే వచ్చి అతను నీలకంఠాన్ని పలుకరించాడు. జరిగినదేదో జరిగిపోయింది. ఆ ఉద్రేకంలో తెలియక కొట్టానన్నాడు శ్రీహరి. క్షమించమని కోరుతున్నాడు శ్రీహరి. శ్రీహరి ఆవిధంగా పశ్చాత్తాపాన్ని తెలియజేస్తుంటే నీలకంఠాని కరికాలిమంట నెత్తికెక్కింది. అతని మీద అంతకుముందున్న కోపం ద్విగుణీకృతమయింది. తనకుతానై వచ్చినపుడుదూషించటము బాగుండదని నీలకంఠం కోపాన్ని చల్లార్చుకొని ఊరుకున్నాడు, సభ్యతా సభ్యతలు తెలిసినవాడు గాబట్టి. ఇద్దరూ కలసి నీలకంఠం గది చేరుకొన్నారు.

సిగరెట్ అంటించాడు నీలకంఠం. శ్రీహరి అనుసరించాడు. ఒక గంటవరకూ ఎవరూ మాట్లాడలేదు. కాని సిగరెట్ టిన్నంతా ఖాళీ అయింది. శ్రీహరి మాట్లాడ దలచాడుగాని, నీలకంఠంగారి భార్య అతని నోటికి తాళంవేసింది.

'వెళ్తొస్తా నం'టూ బయటికి వచ్చేశాడు శ్రీహరి. అదే పనిగ చూస్తూ, పుస్తకాల మధ్య చాపమీద కూర్చున్నాడు నీలకంఠం. వింత ఆలోచనలు బయలుదేరా యాతనినుండి. అన్నిటిని గలిపి ఒక్క అకృతి నివ్వ జూస్తున్నాడు నీలకంఠం.

మేకలు రెండు గడ్డి మేస్తున్నా యాతని గది వాకిటి కెదురుగా. చూస్తున్నాడు వాటి వైపు నీలకంఠం. ఏ విధంగానైనా ఈ ప్రపంచాన్ని కొద్దికాలం మరచిపోవాలని ప్రయత్నిస్తున్నాడు. ఆ రెంటి మేకలను కలిపి తాడుకట్టారెవరో. రెండూ గడ్డిమేస్తూ కలిసి తిరుగుతున్నయ్. దాదాపు ఒక అర్థగంట గడచిపోయింది. ఒకటి అటూ, మరొక మేక ఇటూ లాక్కున్నయ్. త్రాడు తెగిపోయింది. రెండూ రెండు వైపులకు పోయినయ్. నీలకంఠం దీనినంతా జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. ఇంతలో ఆ మేకలను మేపుకొనే ఆడమనిషి రెంటిని దగ్గరకు లాక్కొచ్చి తెగిన త్రాటిని ముడివేసి పోయింది. మళ్ళా రెండూకలసి తిరుగుతున్నయ్.

నీలకంఠం ఉన్నట్లుండి ఒక వేడి నిట్టూర్పు వదిలాడు. అచిత్రంనుండికూడ దేనినో గ్రహించగలిగాడు నీలకంఠం. చిన్న మనస్తత్వాలుగల ఇద్దరూ మానవుల ప్రవర్తనకూడ ఆ మేకల ప్రవర్తనలానే ఉంటుందని ధృఢపరచుకొన్నాడు నీలకంఠం. శ్రీహరి, తనూ ఒకే తెగకు చెందిన మానవ లుమాత్రం కాదనే నిశ్చయానికివచ్చాడు. అందు చేతనే తనకూ శ్రీహరికీ మధ్య ముడివేయుబడిన త్రాటిని ఈసారి తాను స్వహస్తాలతో త్రెంచ దలచాడు.

నీలకంఠం అన్నమాటల ప్రకారం నడిచాడు. శ్రీహరికి తగిన ప్రతీకారం చేశాడు. తనకూ శ్రీహరికీమధ్యసంబంధంపొసగదనిస్పష్టపరచాడు.

ఈనాడు కాకులు కొన్ని అతనిని పొడుచుకు తింటున్నయ్. లేనిపోని తప్పుల నంటిస్తున్నాయా కాకులాతని శరీరానికి. వద్దనటము లేదు నీలకంఠం. ఎందుచేత నంటే, వద్దంటే వినే కాకులు కావు గనుక అవి.

ఆకాకులు శ్రీహరిలో 'మంచి' చూసినయ్. నీలకంఠంలో దుర్మార్గాన్ని కూడా కనిపెట్టగలిగినయ్. శ్రీహరి పాతికో, పరకో సంపాదిస్తున్న పెద్దమనిషిగాబట్టి. నీలకంఠం పనిలేని నిరుద్యోగి కావటంచేత ఈ కాకులు వైవిధ్యాలను నిర్ణయించినయ్. కాని ఈ కాకులకు కూడ చేతకాదు నీలకంఠానికి విశాల ప్రపంచంలో ఉద్యోగాన్ని చూపించడం. నీలకంఠం నిరుద్యోగి కావటమువేదే ఈ కాకులకు ఆధారంగా నిల్చింది... కాదు, కాదు.

పొరబడ్డాను. 'కాకులు'గాదు, 'లోకులు' అనవలసింది బోయి 'కర్మ' (అంటారు మీరు) వశాత్తూ 'కాకులు' అన్నాను.